సాక్షి తిరుపతి

గురువారం । 22 । ఆగస్టు । 2024



కారిడార్‌ను పూర్తి చేయండి

వైజాగ్– చెన్నై కారిడార్ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. - 8లో



రేషన్‌బియ్యం పట్టివేత

ప్రజలకు అందించాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా తడ పోలీసులు పట్టుకున్నారు. - 8లో



యంత్రాలతో కూటమికి ఉపాధి

కూటమి నేతలు యంత్రాలతో ఉపాధి పనులు చేయిస్తూ కూలీల కడుపు కొడుతున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. - 8లో

న్యూస్‌రీల్

రెండు కొత్త కోర్సులు ప్రారంభం

చంద్రగిరి: మండల పరిధిలోని అగరాల సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెప్టెంబర్ మొదటి వారం నుంచి విద్యార్థులకు మరో రెండు కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రిన్సిపల్ సుకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఓటీ), కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్(క్యాడ్)లను తీసుకురానున్నట్లు చెప్పారు. ఈ కోర్సులలో చేరుందుకు ఐటీఐ, ఇంటర్మీడియట్, డిప్లొమా, బీటెక్, ఏదైనా డిగ్రీ అర్హత ఉన్నవారు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కోర్సులను చంద్రగిరి పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ట్రైనింగ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కోర్సు పూర్తి అయిన తర్వాత స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ట్రైనింగ్ తరఫున సర్టిఫికెట్‌ను అందిస్తాన్నారు. ఈ సర్టిఫికెట్ కోర్సుకు ఫీజు రూ.1500 చెల్లించాల్సి ఉంటుందని, వివరాలకు ఫణికుమార్ 80745 30468, డాక్టర్ ప్రకాష్ 70132 99609 నంబర్లలో సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

జిల్లావ్యాప్తంగా పటిష్ట భద్రత

తిరుపతి క్రైమ్: భారత్ బంద్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ముందస్తు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. జిల్లాలోని సబ్ డివిజన్ అధికారులతో పర్యవేక్షణ చేస్తూ బందోబస్తు గురించి వివరించారు. బుధవారం ఉదయం నుంచి రైల్వేస్టేషన్, బస్టాండ్, ప్రధాన సర్కిళ్ల వద్ద ప్రజారవాణాకు ఆటంకం కలగకుండా పహారా కాస్తున్నారు. ఎమర్జెన్సీగా వెళ్లే వాహనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ డయల్ 100కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

రూసా కో–ఆర్డినేటర్ల నియామకం



నియామక పత్రాలను అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని రూసా(రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్) కేంద్ర సమన్వయకర్తలుగా ప్రొఫెసర్లు టి.రమశ్రీ, వి.ఉషారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ అధ్యాపకులు, అధికారులు వారికి అభినందనలు తెలిపారు. కోర్డినేటర్లు మాట్లాడుతూ ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా రూసా ఆధ్వర్యంలో ఉన్నత విద్యతో పాటు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తామన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో ఒక కంపార్ట్‌మెంట్లు మాత్రమే నిండింది. మంగళవారం అర్ధరాత్రి వరకు 73,082 మంది స్వామిని దర్శించుకున్నారు. 27,972 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.46 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. అంతకన్నా ముందు వెళ్లిన వారిని లోనికి అనుమతింబోమని వెల్లడించింది.

నైపుణ్యమస్తు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో అనుకున్న రంగంలో రాణించాలంటే పోటీతత్వాన్ని తట్టుకుని నిలబడాలి. ప్రతిఒక్కరూ తాము ఎంచుకున్న రంగంలో రాణించదానికి చదువుతో పాటు అంతకుమించి నైపుణ్యాలు కూడా అవసరం. స్కిల్స్ లేకపోతే కష్టం. అందుకే తిరుపతి ఎస్వీ వెటర్నరీ వర్సిటీ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ కళాశాలలో బీఎస్సీ డెయిరీ సైన్స్ చదువుతున్న యువతకు, స్వయం సహాయ సంఘాల సభ్యులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు.





పాల ఉత్పత్తులపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

ఉపాధే లక్ష్యంగా యువతకు శిక్షణ



యువతకు అకడమిక్ విద్యతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ అనేది ఎంతో అవసరం. ఆధునిక పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొని ఉన్నత స్థాయికి చేరాలంటే విద్య ఎంత అవసరమో అంతకు మించి వృత్తిలో నైపుణ్యం కలిగి ఉండాలి. పారిశ్రామిక వేత్తగా, ఉన్నత స్థాయి ఉద్యోగిగానో నిలబడాలంటే యువతకు వృత్తి నైపుణ్య శిక్షణతోనే సాధ్యమవుతుంది. నగరంలోని పలు కళాశాలలో 100 మందికి పైగా డెయిరీ సైన్స్ చదువుతున్న విద్యార్థులకు పాల ఉత్పత్తులపై శిక్షణ ఇచ్చాం. విద్యార్థులు స్వతహాగా పాల పదార్థాలు తయారు చేసే స్థాయికి తీసుకొచ్చాం. గతంలో గ్రామీణ మహిళలు మాంసాహార ఉత్పత్తులపై శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాం.

– డాక్టర్ జయభాస్కర్ రెడ్డి, లైవ్‌స్టాక్ ప్రొడక్ట్స్ విభాగాధిపతి, వెటర్నరీ కళాశాల



తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ ఆధ్వర్యంలో నడుస్తున్న లైవ్ స్టాక్ ప్రొడక్ట్స్ విభాగం అధికారులు విద్యార్థులకు, 400 మంది గ్రామీణ, పట్టణ ప్రాంత గృహిణులకు, మహిళా సంఘాల గ్రూపు సభ్యులకు పాల, మాంసాహార ఉత్పత్తులపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా బుధవారం వర్సిటీ ఆవరణలోని డెయిరీ టెక్నాలజీ కళాశాలలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల బీఎస్సీ డెయిరీ సైన్స్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా పాలతో తయారు చేసే రసగుల్లా, కోవా, పన్నీరు, లస్సీ వంటి డెయిరీ ప్రొడక్ట్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించి వారే స్వతహాగా తయారు చేసే విధంగా పూర్తిస్థాయి శిక్షణ అందించారు. డెయిరీ సైన్స్, బీటెక్ డెయిరీ టెక్నాలజీ కోర్సులు నడుపుతున్న కళాశాలలను గుర్తించి విద్యార్థులకు అకడమిక్ విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తున్నారు. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా, పేరొందిన డెయిరీ సంస్థలలోనూ ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందేందుకు శిక్షణ ఎంతో ఉపయోగకరమని వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య తెలిపారు.

మహిళా సంఘాలకు శిక్షణ



మహిళా సంఘాల సభ్యులకు మాంసాహార ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

వర్సిటీలోని లైవ్‌స్టాక్ విభాగం ప్రతినిత్యం మాంసాహార ఉత్పత్తులపై మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇస్తూ స్వయం ఉపాధికి బాటలు వేస్తోంది. తిరుపతి రూరల్ ప్రాంతాలలోని పలు మహిళా సంఘాల సభ్యులకు, గృహిణులకు మాంసాహార ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. ఈ శిక్షణలో ఆధునిక కాలంలో మార్కెట్‌లో డిమాండు కలిగిన ఉత్పత్తుల తయారీపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన మహిళలు తమ స్వగృహాలలో ఉత్పత్తి చేసిన పదార్థాలను నగరంలోని పలు హోటళ్లు, దుకాణాలలో విక్రయిస్తూ ఆర్థిక స్వావలంభన పొందుతున్నారు. దీంతో పాటు గృహిణులకు పెరటికోళ్ల పెంపకంపై శిక్షణ అందించి అందుకు అవసరమైన ఫీడ్ కిట్లను సైతం అందించి ప్రోత్సహిస్తున్నారు.

సొంతంగా తయారు చేశాం

వెటర్నరీ కళాశాల అధ్యాపకులు డెయిరీ టెక్నాలజీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చారు. చాలా సులువుగా ప్రతి ఒక్కరికి అర్థమయ్యే విధంగా పాల ఉత్పత్తుల తయారీ గురించి నేర్పించారు. అధ్యాపకుల సూచనల మేరకు శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే ముగ్గురు విద్యార్థులు కలసి 'కోవా' తయారు చేశాం. చాలా అద్భుతంగా, రుచిగా ఉంది. మాకు విద్యతో పాటు ఉపాధికి ఇలాంటి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది.



పాలకోవా తయారు చేస్తున్న ఎస్వీ ఆర్ట్స్ కళాశాల బీఎస్సీ విద్యార్థులు వేణు, శివనాయక్, వంశీకృష్ణ

వృత్తి నైపుణ్యం ప్రధానం..

మేము బీఎస్సీ డెయిరీ సైన్స్ కోర్సు చదువుతున్నాం. డిగ్రీలు, పీజీలు పూర్తి చేస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయనుకోవడం తప్పు. విద్యతో పాటు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకున్నప్పుడే పోటీ ప్రపంచాన్ని తట్టుకుని ఉద్యోగం సాధించగలం. శిక్షణ తీసుకున్న వెంటనే సొంతంగా పన్నీరు పాల పదార్థాలను తయారు చేశాం. చదువులో స్కిల్ డెవలప్‌మెంట్ అవసరమని తెలిసింది.



పన్నీరు తయారు చేస్తున్న తిరుపతి బీఎస్సీ డెయిరీ సైన్స్ విద్యార్థులు భానుమతి, గీతాబాయ్, మల్లేశ్వరి

ఉద్యోగం సాధిస్తామనే నమ్మకం కలిగింది

మేమే ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో బీఎసీ డెయిరీ సైన్స్ కోర్సు చేస్తున్నాం. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా వెటర్నరీ లైవ్ స్టాక్ ప్రొడక్ట్స్ విభాగం, డెయిరీ టెక్నాలజీ కళాశాల అధ్యాపకులు మాకు పాల పదార్థాల తయారీపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రసగుల్లా స్వీట్‌ను తయారు చేశాం. కోర్సు పూర్తి కాగానే కచ్చితంగా ఉద్యోగం సాధిస్తామనే నమ్మకం ఈ శిక్షణతో కలిగింది.



రసగుల్లా తయారు చేస్తున్న ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు నారాయణ స్వామి, మంజునాథ్, వెంకట్రమణయ్య

చాలా అద్భుతంగా ఇచ్చారు

స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా డెయిరీ టెక్నాలజీ కళాశాలలో పాల పదార్థాల తయారీ విధానంలో శిక్షణ చాలా అద్భుతంగా ఇచ్చారు. ప్రతి విద్యార్థికి అర్థమయ్యే రీతిలో ప్రాక్టికల్‌గా నేర్పించారు. అకడమిక్ చదువులను పూర్తి చేసిన వెంటనే ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుంది.



గులాబ్‌జామ్ తయారు చేస్తున్న బీఎస్సీ విద్యార్థులు రాజు, నవీన్, వంశీకృష్ణ

దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వండి

తిరుపతి అర్బన్: బదిలీల్లో దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నేతలు కోరారు. ఆ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో జేసీని కలిశారు. ఈ సందర్భంగా వీఆర్వోల బదిలీల విషయంలో సానుకూలత చూపలని తెలిపారు. ప్రధానంగా పలువురు దివ్యాంగులు ఉన్నారని వెల్లడించారు. అంతేకాకుండా పలు వ్యాధులతో బాధపడుతున్న వారు ఉన్నారని చెప్పారు. దూర ప్రాంతాలకు బదిలీలు చేస్తే పలు ఇబ్బందులు వస్తాయని తెలియజేశారు. సమీప ప్రాంతాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరారు. ఆ మేరకు ఓ వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తప్పకుండా దివ్యాంగులతో పాటు వ్యాధిగ్రస్తులకు ప్రాధాన్యత కల్పిస్తామని జేసీ వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, తిరుపతి డివిజన్ అధ్యక్షుడు చెంగల్‌రాయల్, సంఘం నేతలు ప్రసాద్, మురళి, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న వీఆర్వోల సంఘం నేతలు

ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపల్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన(పీఎంకేవీవై 4.0) పథకం కింద యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఇందులో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఫీల్డ్ టెక్నీషియన్ నెట్ వర్కింగ్ అండ్ స్టోరేజ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. వీటి కాలవ్యవధి 210 గంటలన్నారు. అభ్యర్థులు టెన్త్, ఆపై విద్యార్హత కలిగి ఉండి, ఆసక్తి ఉన్న వారు 72073 89948కి చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

భక్తుల ఆరోగ్యానికే అధిక ప్రాధాన్యత

తిరుమల: తిరుమలకు వచ్చే భక్తుల ఆరోగ్య భద్రతకే టీటీడీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి చెప్పారు. టీటీడీ ఈఓ శ్యామలరావు ఆదేశాల మేరకు టీటీడీ ఆరోగ్య విభాగం, ఆహార భద్రత విభాగాలతో కలిసి తిరుమలలోని హోటళ్ల నిర్వాహకులు, యజమానులకు శ్రీవారి సేవాసదన్ సత్సంగం హాల్లో బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అన్ని రకాల తినుబండారాల తయారీలో ఫుడ్ సేఫ్టీ నిర్దేశించిన ప్రమాణాలను పాటించాలని సూచించారు. న్యూఢిల్లీకి చెందిన ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫైడ్ ట్రైనర్ సీహెచ్ ఆంజనేయులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అనుసరించాల్సిన పద్ధతులు, నిబంధనల గురించి వివరించారు. టీటీడీ ఆరోగ్య శాఖ డిప్యూటీ ఈఓ ఆశాజ్యోతి మాట్లాడుతూ ప్రతి 3 నెలలకు ఒకసారి తిరుమలలోని హోటళ్ల వ్యాపారులకు శిక్షణ ఇస్తామన్నారు. తిరుమల హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ రావు, తిరుపతి జిల్లా ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జగదీష్, అన్నప్రసాదం సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన హోటళ్ల సిబ్బంది

ప్రాణాలు పోసే డాక్టర్లపైనే దాడులా ?



నిరసన ర్యాలీ చేస్తున్న జూనియర్ డాక్టర్లు

తిరుపతి తుడా: విధుల్లో ఉన్న వైద్యురాలిపై అత్యాచారం, ఆపై క్రూరంగా హత్య చేసిన ఘటనపై తిరుపతిలో నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ మేరకు బుధవారం స్విమ్స్, రుయా ఆస్పత్రుల్లో జూనియర్ డాక్టర్లు నల్ల దుస్తులతో నిరసన తెలిపారు. స్విమ్స్ వైద్యులు దీక్ష శిబిరం వద్దే రోగులకు ఓపీ సేవలు అందించారు. ప్రాథమిక పరీక్ష నిర్వహించి వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ కోలకతా ఆర్‌జీకర్ ప్రభుత్వ ఆస్పత్రిలో విధుల్లో ఉన్న మహిళ వైద్యురాలి పట్ల దుండగులు దారుణానికి పాల్పడడం దుర్మార్గం అన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు నడుం బిగించే వైద్యుల పట్ల ఇంతటి క్రూరంగా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. నేటికీ సమాజంలో అలాంటి క్రూర మృగాలు ఉండడం బాధాకరమన్నారు. కోల్‌కతా ఘటనపై సుప్రీంకోర్టు సైతం స్పందించడం శుభ పరిణామం అని, అయితే అదేస్థాయిలో కఠినమైన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే భార్య పులివర్తి సుధా రెడ్డి నిరసనకారులకు మద్దతు ప్రకటించారు. అనంతరం రుయా సూపరింటెండెంటు డాక్టర్ రవి ప్రభుకు వినత పత్రాన్ని అందజేశారు.



స్విమ్స్‌లో దీక్షా శిబిరం వద్దే ఓపీ సేవలు అందిస్తున్న జూనియర్ డాక్టర్లు



నల్ల దుస్తులు ధరించి నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

వర్సిటీల్లో అడ్మిషన్ల సమాచారం

తిరుపతి సిటీ: తిరుపతిలో పలు వర్సిటీలలో వివిధ కోర్సులకు సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఇంజినీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లు తుదిదశకు చేరుకోగా పీజీ అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. అలాగే డిగ్రీ కోర్సులకు నేటి నుంచి రెండో విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగనుంది.

- వెటర్నరీ వర్సిటీలో ఈనెల 27 నుంచి బీవీఎస్సీ కౌన్సెలింగ్ ప్రారంభం
- ఎస్వీయూలో ఈనెల 28న పీజీ (ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్) సీట్ల కేటాయింపు
- సంస్కృత వర్సిటీలో ఆచార్య, శాస్త్రి, కోర్సులలో స్పాట్ అడ్మిషన్లకు ఈనెలాఖరికి గడువు ముగింపు
- ఈ నెల ఆఖరి వరకు సంస్కృత వర్సిటీలో 20 రకాల డిప్లొమో కోర్సులలో అడ్మిషన్లు
- ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సీఎస్ఈ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుకు తుది విడత కౌన్సెలింగ్‌లో వెబ్ఆప్షన్ల విడుదల.
- 26న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ తుదివిడత సీట్ల కేటాయింపు
- నేటి నుంచి డిగ్రీ కోర్సులకు రెండో విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

తడ: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం తడ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ నరసింహారావు తెలిపిన వివరాల మేరకు.. అక్కంపేట వద్ద రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నట్లు అందించిన సమాచారం మేరకు స్థానిక సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్యకు సమాచారం ఇచ్చి దారిలో కాపు కాచామన్నారు. ఈ క్రమంలో అండగుండాల నుంచి వస్తున్న మినీ లారీని పరిశీలించగా అందులో 60 బస్తాలు (2970 కిలోలు) ఆంధ్రా రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. అనంతరం వాహనాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్ వెంకటేష్‌ను తడ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. పట్టుబడిన బియ్యాన్ని కొండూరు వద్ద ఉన్న సివిల్ సప్లయ్ గోదాముకు తరలించారు. వీటి విలువ రూ.1.98 లక్షలు ఉంటుందని తెలిపారు. బియ్యం స్లగ్లర్, వాహన ఓనర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం పేరుతో వసూళ్లు అవాస్తవం

తిరుపతి కల్చరల్: తమ యూనియన్ నాయకులు ఉద్యోగం ఇప్పిస్తామని, లేదా ప్రభుత్వంలో కలిపిస్తామని చెబుతూ వసూళ్లు చేస్తున్నారని బుధవారం ప్రచురితమైన వార్త అవాస్తమని 104 ఎంప్లాయిస్ యూనియన్ తిరుపతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమర్‌నాథ్, బత్తిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. యూనియన్ సభ్యత్వాలు తప్ప ఎవరి దగ్గర ఎటువంటి రుసుం తీసుకోలేదన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి ఆందోళన

గూడూరురూరల్: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి అనంతరం తనకు ఏమీ తెలియదని బుకాయించిన యువకుడి ఇంటి వద్ద బుధవారం ఓ యువతి నిరసనకు దిగిన ఘటన గూడూరులో వెలుగు చూసింది. పట్టణంలోని అరుంధతీయవాడకు చెందిన ఓ యువతిని అదే ప్రాంతానికి చెందిన యువకుడు కొద్దికాలంగా ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. ఇప్పుడు అతను మరో వివాహానికి సిద్ధం కావడంతో ఆమె అతని ఇంటి వద్ద బైఠాయించింది. దీంతో చుట్టుపక్కల వారు విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం విషయం పోలీసు స్టేషన్‌కు చేరడంతో పోలీసులు విచారణ చేస్తున్నారు. దీనిపై ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబును వివరణ కోరగా యువతి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

శ్రీగంధం పట్టివేత

భాకరాపేట : ఆటో సహా శ్రీగంధం స్వాధీనం చేసుకుని 9 మంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎర్రావారిపాళెం ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎర్రావారిపాళెం సమీపంలో 66 కేజీలు బరువు ఉన్న శ్రీగంధం చెక్కలను ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నామని, 9 మంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

ఇటీవల తిరుపతి జిల్లాలోని కొన్ని ప్రభుత్వ హాస్టళ్లలో అతిసారం విజృంభించింది. పలువురు విద్యార్థులు ఆస్పత్రుల పాలయ్యారు. ఇప్పుడు చిత్తూరు జిల్లాలో పేరొందిన అపోలో మెడికల్ కాలేజీలో సైతం అతిసారం విద్యార్థులను ఓ కుదుపు కుదిపింది. ఒకరూ కాదు.. ఇద్దరూ కాదు ఏకంగా 300 వరకూ విద్యార్థులు అతిసారం బారిన పడి విలవిలలాడారు. అదీనూ అందరూ వివిధ కోర్సులు అభ్యసిస్తున్న వైద్య విద్యార్థులే కావడం గమనార్హం. కొందరికి అపోలోనే చికిత్స చేస్తుండగా, మరికొందరిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.


జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

అతిసారం..హాహాకారం


బాధితురాలిని ఆస్పత్రికి తీసుకొచ్చిన దృశ్యం



కాణిపాకం: తినే తిండిలో నాణ్యత లోపించింది. ఆ లోపం విద్యార్థులకు శాపంగా మారింది. కలుషిత ఆహారం విద్యార్థులను అతిసారంతో అతలాకుతలం చేసింది. దాదాపు 300మంది విద్యార్థులను వాంతులు, విరేచనాలకు గురి చేసింది.బాధిత విద్యార్థులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రి తరలిస్తున్నారు. మరి కొంత మందిని అపోలో కాలేజీలో చికిత్స చేస్తున్నారు. కేసుల సంఖ్య మరింత పెరుగుతోంది. జిల్లావైద్య ఆరోగ్యశాఖ అదికారులు అపోలోలో వైద్య శిబిరం ఏర్పాటుకు పూనుకున్నారు. ఈ ఫుడ్ పాయిజన్‌కు ప్రధాన కారణం ఆహార నాణ్యత లోపమంటూ అధికార వర్గాలు, అపోలో విద్యార్థులు చెప్పారు. చిత్తూరు నగరానికి దాదాపు 4 కిలోమీటర్ల దూరంలోని మురకంబట్టు ప్రాంతంలో అపోలో మెడికల్ కాలేజీ ఉంది. ఈ కాలేజీలో ఎంబీబీఎస్, ఏహెచ్ఎస్, బీఎస్సీ, ఎంఎస్సీ, ఫిజియోథెరపీ, బీటెక్, ఎంబీఏ కోర్సుల్లో దాదాపు 900 మంది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందినవారు చదువుతున్నారు. వీరంతా కాలేజీ హాస్టల్లో ఉంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం(అన్నం, వంకాయ, సాంబరు) ఆహారం కలుషితమైనట్లు తెలుస్తోంది. ఆ రోజు రాత్రి విద్యార్థుల్లో కొందరికి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. తర్వాత రాత్రి దోస, సాంబరు తిన్నారు. ఈ భోజనం తిన్న చాలా మందికి బుధవారం వేకువజామున 2 గంటల ప్రాంతంలో వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. ఆ సమయంలో విద్యార్థులు బాగా ఇబ్బంది పడ్డారు. ఉదయానికి ఇది మరింత తీవ్రమైంది. అప్పటి నుంచి విద్యార్థులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి బాటపట్టారు. విషయాన్ని తల్లిదండ్రులకు చేరవేయడంతో కొంత మంది ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మరి కొంత మందిని అపోలోలోనే ఉంచి చికిత్స చేస్తున్నారు. అయితే ఉదయం అల్పాహారం (మిరపకాయ బజ్జీ, ఉప్మా, ఉగ్గాని) తీసుకున్న మరింత మంది కూడా మధ్యాహ్నానికి డయేరియా బారిన పడ్డారు. వారందరినీ అంబులెన్సులలో చిత్తూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. సాయంత్రం 5 గంటలకు 200మంది బాధితులయ్యారని అధికారులు చెబుతుండగా, విద్యార్థుల మాత్రం 300 మంది డయేరియా బారినపడినట్లు చెప్పారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందిన డిశ్చార్జి అయిన కొంతసేపటికే మళ్లీ అస్వస్థతతో బాధితులు ఆస్పత్రిలో చేరారు. రాత్రికి బాధితుల సంఖ్య మరింత పెరగవచ్చని విద్యార్థులు, సిబ్బంది, అధికారులు చెప్పారు.

మీడియాను అనుమతించకుండా..

వైద్య విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని సమాచారం అందుకున్న పోలీసులు, పాత్రికేయులు అపోలో ఆస్పత్రి అత్యవసర విభాగానికి వెళ్లడంతో చుక్కెదురైంది. లోపలికి అనుమతించకుండా సెక్యూరిటీ సిబ్బంది తలుపులు వేశారు. దీంతో ఆ ప్రాంతం అంతా గందరగోళంగా మారింది. పోలీసులు...మీడియాకు, సిబ్బందికి మధ్య అర్థగంట పాటు వాగ్వివాదం చోటుచేసుకుంది. తర్వాత తలుపులు తోసుకుంటూ పాత్రికేయులంతా లోపలికి వెళ్లిపోయారు. ఇక అతిసారం ఘటనతో ఓ విద్యార్థి సంఘం అపోలో మెడికల్ కాలేజీలో విధ్వంసం సృష్టించింది. నినాదాలు చేస్తూ..కాలేజీలోని కుర్చీలను ధ్వంసం చేసింది. విధ్వంసాన్ని కొంత మంది విద్యార్థులు, కాలేజీ సిబ్బంది వీడియో తీశారు.



అత్యవసరం విభాగం వద్ద పోలీసులు.. మీడియా, సిబ్బందికి మధ్య వాగ్వివాదం

అధికారుల తనిఖీ

అపోలో విద్యార్థులు వాంతులు, విరేచనాలతో అధికసంఖ్యలో ఇబ్బందులకు గురవుతున్నారని తెలుసుకున్న జిల్లా అధికారులు అక్కడికి పరుగులు తీశారు. బాధిత విద్యార్థులను పరామర్శించారు. వాంతులు, విరేచనాలకు కారణాలేమిటో డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి విద్యార్థులను ఆరా తీశారు. మెరుగైన చికిత్స చేయాలని ఆస్పత్రి అధికారులకు ఆదేశించారు. అలాగే డీఎంఅండ్‌హెచ్ఓ ప్రభావతిదేవి అపోలో కాలేజీని తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలుసుకున్నారు. బాధితులకు వాంతులు, విరేచనాలతో పాటు తీవ్ర జ్వరం, ఒంటినొప్పులు, అధిక చలి, తలనొప్పి వంటి లక్షణాలతో బాధపడుతున్నట్టు గుర్తించారు. కాలేజీతో పాటు హాస్టల్ పారిశుధ్య నిర్వహణ, శుభ్రత ఎలా ఉందో పరిశీలించారు. తాగునీటి నమూనాలు సేకరించారు. అలాగే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు వంటగదిని తనిఖీ చేశారు. అక్కడ వండిన ఆహార పదార్థాలేవీ లేకపోవడంతో బియ్యం, కందిపప్పు, శెనగ గింజలు శ్యాంపిల్స్ మాత్రమే తీసుకుని వాటిని విజయవాడకు పంపారు. మూడు రోజుల్లో ఈ ఫలితాలు రానున్నాయని నాగేంద్రబాబు పేర్కొన్నారు. ఇక గురువారం ఉదయం 9 గంటలకు తిరుపతి నుంచి రాపిడ్ రెస్పాన్స్‌టీం (ఆర్ఆర్‌టీ) రానుంది. ఈ టీం ఆస్పత్రి నిర్వహణను తనిఖీ చేయనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెప్పారు.


అతిసారం బాధితులకు అందిస్తున్న వైద్యసేవలు

భోజనం బాగాలేదని...

క్యాంటీన్‌లో వండి పెడుతున్న భోజనం సరిగా లేదని పలుమార్లు విద్యార్థులు కాలేజీ అధ్యాపకులు, నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినట్లు పలువురు చెప్పారు. భోజనంలో వచ్చిన పురుగులను కూడా చాలాసార్లు చూపించిననూ భోజన విషయంలో ఎలాంటి మార్పు లేదని సమాచారం.

అపోలో నూతన భవనంలో చికిత్స

అపోలో కాలేజీలోని కొత్త భవనంలో సైతం అతిసారం విద్యార్థులకు వైద్యసేవలు అందిస్తున్నారు. అక్కడి ఉన్న నాలుగు ఫ్లోర్లు ఉండగా, గ్రౌండ్ ఫ్లోర్ మొదలుకుని మూడు ఫ్లోర్లలోని బెడ్లలో విద్యార్థులను అడ్మిట్ చేశారు.


చికిత్స పొందుతున్న అతిసారం బాధిత విద్యార్థులు

24, 25 తేదీల్లో క్రీడాకారుల ఎంపిక

తిరుపతి కల్చరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 క్రికెట్ పోటీలకు క్రీడాకారులను 24, 25 తేదీల్లో ఎంపిక చేయనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ కుమార్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు జోన్లలో ఈ నెల 24, 25 తేదీల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మొట్టమొదటిసారిగా కార్పొరేషన్, నగరం, మండలం, గ్రామాల్లో క్రీడాకారులు క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు వెల్లడించారు. 2010 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారు క్రీడాదుస్తులు, సొంత కిట్, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకుని రావాలని సూచించారు. 24న పుత్తూరులోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తిలో కేసీసీ క్రికెట్ నెట్స్, పీలేరులో పీఐవోసీ క్రికెట్ అకాడమీ, వాల్మీకిపురంలో జీవీఎస్‌సీఎస్ క్రికెట్ గ్రౌండ్స్‌లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 25న తిరుపతిలో సీవీ క్రికెట్ అకాడమీ, చిత్తూరులో చిత్తూరు పోలీస్ గ్రౌండ్, పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వి.కోటలో జీఎంఆర్ క్రికెట్ అకాడమీలో పోటీలు ఉంటాయని, వివరాలకు 9000214966, 8886185559లో సంప్రదించాలని కోరారు.

యంత్రాలతో కూటమికి ‘ఉపాధి’

బైరెడ్డిపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై సైతం కక్ష సాధింపులకు దిగుతూ ఫీల్డ్ అసిస్టెంట్లను, సంఘమిత్రలను తొలగిస్తోందని వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకం పనులకు రూ.6కోట్ల నిధులు మంజూరయ్యాయని, కూటమి నేతలు యంత్రాలతో పనులు చేస్తూ కూలీల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వలసల నివారణ కోసం ప్రవేశపెట్టిన పథకం కూటమి నేతల జేబులు నింపుకోవడానికి ‘ఉపాధి’ ఉపయోగపడుతోందన్నారు. ధర్మపురి, నాగిరెడ్డిపల్లె, చీలంపల్లె, కడపనత్తం గ్రామాల్లో యంత్రాలతో పనులు చేసి బిల్లులు స్వాహా చేశారని ఆరోపించారు.

తిరుమలలో మెగాస్టార్ చిరంజీవి


చిరంజీవికి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ ఈఓ

తిరుమల: తిరుమల శ్రీవారిని ప్రముఖ నటుడు, మెగాస్టార్ చిరంజీవి గురువారం దర్శించుకోనున్నారు. బుధవారం రా త్రి తిరుమలకు చేరుకున్న ఆయనకు అతిథి గృహం వద్ద టీటీడీ రిసెప్షన్ డిప్యూటీ ఈఓ భాస్కర్ స్వాగతం పలికారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తిరుపతి క్రైమ్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు అలిపిరి సీఐ రామకిషోర్ తెలిపారు. బుధవారం నగరంలోని లీలామహల్ సమీపంలో ట్రాక్టర్లను తిరుపతి సెబ్ అధికారులు తనిఖీ చేయగా, రెండు ట్రాక్టర్లకు బిల్లులు లేకపోవడంతో అలిపిరి పోలీసులకు అప్పగించారు. ట్రాక్టర్ డ్రైవర్లు రామిరెడ్డి, గురవయ్యను అరెస్ట్ చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ముగ్గురికి జైలు

తిరుపతి లీగల్ : అధిక మోతాదులో మద్యం తాగి తిరుపతిలో నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న ముగ్గురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. తిరుపతి, లక్ష్మీపురానికి చెందిన కార్ డ్రైవర్ బి.సురేష్‌కు నాలుగు రోజులు జైలు శిక్ష, రూ. 10 వేలు జరిమానా, తిరుపతి, చెర్లోపల్లికి చెందిన ఆటో డ్రైవర్ సి.శివకు మూడు రోజులు జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా, చిత్తూరు జిల్లా సదుంకు చెందిన ఆటో డ్రైవర్ కె.సునీల్‌కు రెండు రోజుల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. అలాగే తక్కువ మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 13 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. అదేవిధంగా నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 60 మందికి రూ.30 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. తిరుపతి అర్బన్ ఎస్పీ సుబ్బరాయుడు, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమ ఆచారి ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు చేపడుతున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న డి.రమణ(165), కె.మస్తాన్(1887) అనే ఇద్దరు కానిస్టేబుళ్లను తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు విధుల నుంచి సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నతాధికారుల వివరాల మేరకు.. వెంకటగిరి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న రమణ, మస్తాన్ అవినీతికి పాల్పడుతున్నట్లు సమాచారం. పైగా స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు న్యాయం చేయకుండా, వారి బాధలను తమకు అనుకూలంగా మలుచుకుని అక్రమాలకు పాల్పడినట్టు అధికారుల విచారణలో వెలుగు చూశాయి. అలాగే గతంలో కూడా వీరిద్దరిపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నట్లు అధికారుల విచారణలో వెల్లడైన్నట్లు తెలుస్తోంది.

హోంగార్డు సస్పెండ్

తిరుపతి క్రైమ్: తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న చిన్న తంబి ట్రావెల్స్ వాళ్ల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఎస్పీకి ఫిర్యాదులు అందాయి. దీనిపై దర్యాప్తు చేయగా 4 నెలల క్రితం శ్రీ సిటీ పోలీస్ స్టేషన్‌లో పని చేసినప్పుడు స్క్రాబ్స్ ఓనర్స్ నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. విచారణలో నిజమని తేలింది. దీంతో అతన్ని బదిలీపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు వేశారు. ఇక్కడ కూడా అతను వసూళ్లకు పాల్పడినట్లు పక్కా ఆధారాలు లభించడంతో సస్పెండ్ చేశారు.

కారిడార్ పనులు వేగవంతం చేయండి

తిరుపతి అర్బన్: వైజాగ్–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో పాటు రెవెన్యూ, జాతీయ రహదారులు, అటవీ, ఇరిగేషన్ శాఖ విభాగాల అధికారులతో సమీక్షించారు. భూసేకరణతోపాటు పెండింగ్ కేసులు, పరిహారం తదితర సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. ఆయా విభాగాల పరిధిలోని సమస్యలను ఆ శాఖల అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సమిష్టిగా పనిచేస్తేనే వైజాగ్–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులు ముందుకు సాగుతాయని స్పష్టం చేశారు. అంతేకాకుండా 7 ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లకు నీటి సరఫరా పనులు, భూసేకరణ, ఆక్రమణల విషయాలపై సీరియస్‌గా ముందుకు వెళ్లాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ సతీష్, గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ రత్నం, డిప్యూటీ జోనల్ మేనేజర్ చంద్రశేఖరయ్య, తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఈ మదన్ మోహన్, ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం డీటీ స్వామినాథన్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించండి

అంగన్‌వాడీ పాఠశాలల్లో పౌష్టికాహారాన్ని అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఆయన కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ అధికారులు, ఉద్యోగులతో సమీక్షించారు. పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఐసీడీఎస్ సిబ్బంది ప్రధానంగా బాల్య వివాహాలకు తావులేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనాథలు, ఒంటరి మహిళలకు అవసరమైన మేరకు వసతి ఏర్పాట్లు, భోజన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి నెల జిల్లా రిపోర్ట్ ఇవ్వాలని పీడీ జయలక్ష్మిని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీపీఓ శివకుమార్, పలువురు సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

హెల్త్ సెంటర్ భవనాలు పూర్తి చేయండి

జిల్లాలో హెల్త్ సెంటర్ భవన నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన ఆర్అండ్‌బీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్అండ్‌బీ జిల్లా అధికారి మధుసూదన్‌రావు, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఐటీ– మల్టీ నేషనల్ కంపెనీ(జెన్‌ప్యాక్ట్)లో ఉద్యోగాల కల్పన కోసం రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం మాట్లాడుతూ బీటెక్, ఏదైనా డిగ్రీ 2022 నుంచి 2024 కాలంలో పూర్తి చేసిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 1500 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, అర్హత ఉన్నవారు ఈనెల 28వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 9988853335 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

23 నుంచి గ్రామసభలకు వెళ్లండి

అధికారులంతా ఈ నెల 23వ తేదీ నుంచి గ్రామసభలకు వెళ్లాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం ఆయన అధికారులతో మాట్లాడుతూ గ్రామసభల్లో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని తెలియజేయాలని చెప్పారు. సెప్టెంబర్ 11వ తేదీ నుంచి కొత్త ఇసుక పాలసీని అమలు చేయాలని తెలిపారు. విధివిధానాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. మరోవైపు స్థానిక సమస్యలను తెలుసుకోవాలని, ఈ సభలకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులను ఆహ్వానించాలని తెలియజేశారు. కచ్చితంగా ప్రతి ఉద్యోగి హాజరు కావాలని సూచించారు.